క్లుప్తంగా

డిప్యూటీ సీఎంను కలిసిన నాయకులు

కొత్తగూడెంఅర్బన్: డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్కను గురువారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో కొత్తగూడెం కాంగ్రెస్ నాయకులు కలిశారు. స్థానిక సమస్యలు, వాటి పరిష్కర మార్గాలపై భట్టితో చర్చించినట్లు వారు వివరించారు. పొదెం వీరయ్య, రజాక్, కాసుల వెంకట్, మాదా శ్రీరాములు, మోరె రమేష్‌కుమార్, ఎంఏ.సవీర్ పాల్గొన్నారు.

ఈత పోటీల్లో విజేతలకు సన్మానం

సింగరేణి(కొత్తగూడెం): సికింద్రాబాద్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఐఎన్‌టీయూసీ నాయకులు గురువారం కొత్తగూడెంలో సన్మానించారు. కొత్తగూడెం ఏరియా సింగరేణి ఉద్యోగి మంగ రమేష్ కుమారుడు ప్రవీణ్, సింగరేణి మెయిన్ ఆస్పత్రి డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి పతకాలు సాధించగా సన్మానించారు. రజాక్, నాగమోహన్, సాగర్, సీహెచ్.కుమార్, గౌస్, భీముడు, రుక్మిణి పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన జీఎం లక్ష్మీనారాయణ

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ సెక్యూరిటీ జీఎంగా చందా లక్ష్మీనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో విధులు నిర్వహించిన కోడూరి శ్రీనివాస్‌రావు జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ)గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో యాజమాన్యం హెచ్‌ఆర్‌డీ కార్యాలయంలో ఏజీఎంగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణకు జీఎం సెక్యూరిటీ బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు గురువారం బాధ్యతలు స్వీకరించారు.

సెలవులు మంజూరు చేయాలని వినతి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో జూనియర్ అసిస్టెంట్లకు సెలవులు(సీఎల్స్) మంజూరు చేయాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజుకు వినతిపత్రం అందజేశారు. ఏరియా ఉపాధ్యక్షుడు ఎం.డీ.రజాఆక్ మాట్లాడుతూ.. కొత్తగా నియమితులైన వారికి వెంటనే సీఎల్స్ మంజూరు చేయాల్సి ఉన్నా అలా జరగలేదన్నారు. యాజమాన్యం తీరుతోనే ఆలస్యంగా నియామకాలు జరిగినందున సెలవులు మంజూరు చేయాలని కోరారు.

రిజర్వేషన్లు కల్పించాలి

కొత్తగూడెంఅర్బన్: కులం, మతం వెల్లడించనోళ్లకు స్పెషల్ కాలమ్ పెట్టాలని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేయడాన్ని స్వాగతిస్తున్నామని సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ సమన్వయకర్త చార్వాక తెలిపారు. గురువారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులం, మతం పాటించని వారికి 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

ఎన్డీలో చేరిక

ఇల్లెందు: ఎన్డీ వైకే వర్గం రాజకీయాలు నచ్చని పలువురు చంద్రన్న వర్గం వైపు పయనిస్తున్నారని ఎన్డీ చంద్రన్న వర్గం రాష్ట్ర నాయకులు ఆరెల్లి కృష్ణ, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి బానోతు ఊక్లా అన్నారు. గురువారం ఇల్లెందు స్టేషన్ బస్తీలో జరిగిన ఎన్డీ చంద్రన్న వర్గం జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్డీ వైకే వర్గం నుంచి యనగంటి రమేష్, పెద్ద నర్సయ్య, అమృ తదితరులు తమ వర్గంలో చేరినట్లు తెలిపారు.

డ్రైవర్లకు ట్రిప్పు మామూలు పెంపు

ఇల్లెందు: ఇల్లెందు నుంచి వివిధ ప్రాంతాలకు ధాన్యం (వడ్లు) రవాణా చేస్తున్న లైన్ బండి లారీ డ్రైవర్లకు రూ.700 నుంచి రూ.800 ట్రిప్పు మామూలు పెంచుతున్నట్లు యూనియన్ నేతలు వెల్లడించారు. గురువారం ఇల్లెందు డీ బ్లాక్ వద్ద యూనియన్‌లకు లారీ డ్రైవర్లు, కార్మిక సంఘాల నేతలతో జరిగిన చర్చల్లో వేతన ఒప్పందం జరిగిందని తెలంగాణ ప్రగతిశీల ఆటో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ (ఇఫ్టూ) ప్రతినిధులు తోడేటి నాగేశ్వరరావు, కొక్కు నాగేశ్వరరావు వెల్లడించారు.

నిధులున్నా నిష్ప్రయోజనం..

- ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో సిబ్బంది, రోగుల అవస్థలు
- రూ.62 లక్షల విలువైన పనులకు రెండు నెలల క్రితం అనుమతి
- అయినా ఇప్పటికీ అసంపూర్తిగానే...


ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రి భవనం

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో మరమ్మతులకు డీఎంఎఫ్‌టీ రూ.62 లక్షలు నిధులను కేటాయించి పరిపాలనా అనుమతులు జారీ చేశారు. ఇది జరిగిన రెండు నెలలు గడిచినా ఏ ఒక్క పని కూడా పూర్తి కాలేదు. చికిత్స కోసం వచ్చే వారికి సదుపాయాలు కల్పించాలని నిర్ణయించినా ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వెరసి పనుల్లో జాప్యం జరుగుతోంది.

కలెక్టర్ చొరవతో...

నాలుగు నెలల క్రితం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఇల్లెందు వైద్యశాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆయన గుర్తించిన సమస్యల పరిష్కారం కోసం రూ.62లక్షలు కేటాయించారు. ఇందులో విద్యుత్ మరమ్మతుల కోసం రూ. 17.25 లక్షలు, భవనం పైకప్పు లీకేజీల మరమ్మతుకు రూ.25 లక్షలు, మరుగుదొడ్ల మరమ్మతుకు రూ.9.85 లక్షలు, తలుపులు, కిటికీల మరమ్మత్తులు, రెయిలింగ్ ఏర్పాటు, రంగులు వేసేందుకు రూ.9.90 లక్షలు కేటాయించారు. తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎంఎస్ఐడీసీ) ద్వారా టెండర్ పిలిచి పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో టెండర్ పూర్తిచేసి వర్క్ ఆర్డర్ ఇవ్వగా కొన్ని విభాగాల్లో పనులు మొదలుపెట్టినా ఇప్పటివరకు 70 శాతం పనులు కూడా పూర్తి చేయలేదు. తద్వారా చికిత్స కోసం వచ్చే వారి ఇక్కట్లు తీరకపోగా... సిబ్బంది కూడా అవస్థ పడుతున్నారు.

లీకవుతున్న పై కప్పు .. పొంచి ఉన్న ప్రమాదం

ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రి పైకప్పు లీకేజీల అవుతుండటంతో ప్రమాదం పొంచి ఉంది. ఈ మరమ్మతులకు నిధులు కేటాయించగా.. ఇటీవల వర్షాలతో లీకేజీ కాగా యంత్రాలను ఇతర గదుల్లోకి మార్చారు. ఇక లీకవుతున్న గదుల్లో విద్యుత్ లైన్లు, స్విచ్ బోర్డులు షార్ట్ సర్క్యూట్ అవుతున్నాయి. ఇల్లెందు హాస్పిటల్ భవనం రెండు విభాగాలుగా ఉంది. 2000 సంవత్సరంలో కొత్త భవనం నిర్మించగా.. విద్యుత్ వైరింగ్‌లో పీవీసీ పైపులు వాడారు. పాత భవనాన్ని 1970కి పూర్వం నిర్మించడంతో విద్యుత్ వైరింగ్ కోసం వాడిన ఐరన్ పైపుల ద్వారా ఇబ్బంది ఎదురవుతోంది తెలుస్తోంది. దీంతో గోడలపైప్లాస్టిక్ పైపులతో వైరింగ్ చేయించాలని నిర్ణయించినా పనులు మొదలుకాలేదు.


అసంపూర్తిగా వాకింగ్ ట్రాక్ నిర్మాణం


పూర్తికాని మరుగుదొడ్ల మరమ్మతు పనులు

సదుపాయాలు లేక ఇక్కట్లు



అరు నెలలుగా సరైన సదుపాయాలు లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మరమ్మతుల పేరుతో యంత్రాలను ఇతర గదుల్లోకి మార్చడంతో సరైన వైద్యం అందడం లేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ఇలా జరుగుతోందని తెలుస్తోంది.

– నాయిని సైదులు, ఇల్లెందు

పనులు సాగుతున్నాయి..



మరుగుదొడ్లు, గార్డెన్ మినహా ఇతర పనులు 70శాతం పూర్తయ్యాయి. పదిరోజుల్లో మిగిలిన కూడా పూర్తి చేసి అప్పగిస్తాం. పనులు ఆలస్యంగా మొదలుకావడంతోనే ఇలా జరిగింది. త్వరగా పూర్తిచేసేలా ఇప్పటికే కాంట్రాక్టర్‌పై ఒత్తిడి పెంచాం.

– సలీం, ఏఈ, ఇల్లెందు హాస్పిటల్

ఉన్నతాధికారుల దృష్టికి...



ఆస్పత్రిలో రూ.62 లక్షల తో చేపట్టిన పనుల్లో జాప్యం జరుగుతుండడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పనులను మేం కూడా పర్యవేక్షిస్తున్నాం.

– డాక్టర్ జి. హర్షవర్ధన్, సూపరింటెండెంట్, ఇల్లెందు హాస్పిటల్

ఈఎస్ఐ అమలు చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు తక్షణమే ఈఎస్ఐ అమలు చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని, హెడ్డాఫీస్, మెయిన్ ఆస్పత్రి, బంగ్లోస్ ఏరియాలో కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. సింగరేణిలో పనిచేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు తక్షణమే ఈఎస్ఐ అమలు చేయటానికి తగిన చర్యలు చేపట్టాలని, కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబ సభ్యులందరికీ ఉచిత వైద్య సౌకర్యం అమలు చేస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని, కానీ చర్యలు చేపట్టడంలో తీవ్రజాప్యం చేస్తోందని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ ద్వారా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబ సభ్యులందరికీ ఉచిత వైద్య సౌకర్యం, ప్రమాదబీమా, సౌకర్యం, ఇతర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి


మాట్లాడుతున్న పానిశెట్టి వెంకటేశ్వర్లు

పాల్వంచరూరల్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయం కోసం ప్రతీ కార్యకర్త కృషి చేసి స్థానిక సంస్థల్లో పాగా వేయాలని జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పట్టణంలో గురువారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కష్టపడి పార్టీ బలోపేతం కోసం కృషి చేసే కార్యకర్తలకు పార్టీ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జిల్లాలో పార్టీ 60వేల సభ్యత్వాలకు చేరువలో ఉందన్నారు. దేశాభివృద్ధి, పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసే కార్యకర్తలు ఉన్న పార్టీ బీజేపీ అన్నారు. సమావేశంలో గొడుగు శ్రీధర్, మాలోతు గాంధీ, భూక్యా రాజేష్, పాలోజు క్రాంతి, బండారు చంద్రశేఖర్, గుగులోతు శంకర్, బాల కిరణ్, ఎల్.ప్రశాంత్, ధరావత్ బాలాజీనాయక్, గంధం ప్రసాద్‌గౌడ్, కె.రంజిత్, మాదారపు లక్ష్మణ్, ఎస్.వెంకటరమణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పత్తి పంటకు మద్దతు ధర కల్పించండి..

కొత్తగూడెంటౌన్: రైతులు పండించిన పత్తి పంటకు క్వింటా ఒక్కంటికి రూ.13 వేలు చెల్లించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించాలని లేని పక్షంలో ఉద్యమిస్తామని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్టీ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ రాజేష్‌నాయక్ హెచ్చరించారు. గురువారం కొత్తగూడెం రైటర్‌బస్తీలో జరిగిన ఎస్టీ సంఘాల ఐక్య వేదిక సమావేశంలో రాజేష్‌నాయక్ పాల్గొని మాట్లాడారు. కొత్తగూడెం జిల్లాలో సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పత్తి క్వింటా ధరను రూ.13 వేలు చెల్లించి కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలోని ఏజెన్సీ మండలాలు, షెడ్యూల్డ్ ప్రాంతం, పీసా చట్టం అమలులో ఉందని, ఐదు నుంచి పది ఎకరాల విస్తీర్ణంలో పత్తి కొనుగోలు తాత్కాలిక కేంద్రంగా గిరిజనేతరులు సిండికేట్ అయినట్లు చెప్పారు. ఎలాంటి అర్హత లేనప్పటికీ చట్టానికి వ్యతిరేకంగా తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. దళారి వ్యవస్థపై పీసా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శివనాయక్, కేశవ్‌నాయక్, దశరథ్ నాయక్, నాగేశ్వరరావు నాయక్, జానకీరామ్, సాయి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజేష్‌నాయక్

కేజీబీవీలో దరఖాస్తుల ఆహ్వానం

టేకులపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో డే వాచ్ ఉమెన్, అటెండర్ మొత్తం రెండు బోధనేతర మహిళా పోస్టులు ఖాళీగా ఉన్నాయని టేకులపల్లి మండల విద్యాశాఖాధికారి అజ్మీర జగన్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించడం జరుగుతుందని, ఆసక్తి గల వారు ఈనెల 8 నుంచి 11వ తేదీ ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

కేఓసీ పీఓకు సన్మానం

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు ఆఫీసర్ వి.శ్రీనివాసరావు కార్పొరేట్ పర్చేజ్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం ఇల్లెందు ఏరియా జీఎం చాంబర్‌లో సన్మాన, వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పీఓను జీఎం జాన్ ఆనంద్, ఏరియాలోని వివిధ శాఖల అధికారులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

నేడు ఎక్సైజ్ కార్యాలయం ముట్టడి

ఇల్లెందురూరల్: మద్యం దుకాణాలలో అధిక ధరలను కట్టడి చేయాలని సేవాలాల్ సేన మండల శాఖ అధ్యక్షుడు వాంకుడోత్ రమేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. పల్లెల్లో బెల్టుషాపులపై చర్య తీసుకోవాలని కోరుతూ గత నెల 24వ తేదీన ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశామని, అయినా పట్టించుకోకపోవడంతో శుక్రవారం ఇల్లెందు ఎక్సైజ్ కార్యాలయం ముట్టడికి నిర్ణయించామని వివరించారు. ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

మళ్లీ ఫిర్యాదు చేస్తాం..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో వారాంతపు సంత టెండర్లలో జరిగిన అవకతవలపై గురువారం కార్యాలయంలో జరిగిన విచారణ ప్రక్రియ సరైన పద్ధతిలో జరగలేదని సీడీఎంఏ ఆదేశాలను ఆర్డీఎంఏ బేఖాతరు చేశారని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ ఆరోపించారు. విచారణ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో హాజరైన కామేష్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్యాలయంలో సరైన పద్ధతిలో విచారణ జరగలేదని, దీనిపై మళ్లీ సీడీఎంఏకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

గిఫ్ట్‌లు ఇవ్వండి..

పాల్వంచ: కేటీపీఎస్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులకు ప్రతీఏటా రావాల్సిన గిఫ్ట్, రుణం రూ.10లక్షల నుంచి రూ.15లక్షలకు పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ అనుబంధ హెచ్ 64 యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రావుల మురళీ, దుగ్గిరాల సుధాకర్ అన్నారు. గురువారం స్థానిక కేటీపీఎస్ సొసైటీ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ ఆదినారాయణను కలిసి త్రిసభ్య కమిటీని వేసి సమస్యలు పరిష్కరించారు. త్రిసభ్య కమిటీ వేసి ఉద్యోగులకు గిఫ్ట్‌లు అందేలా చూడాలని టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర జెన్‌కో కార్యదర్శి సీహెచ్.రమేష్ అన్నారు. ఈ మేరకు డీసీఓకు వినతిపత్రం అందించారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ 35 వార్డులో కూలీలైన్, గాజులరాజం బస్తీలో జరుగుతున్న ఇంటింటా కులగణన సమగ్ర సర్వే కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని వార్డు కౌన్సిలర్ రుక్మాంగధర్‌బండారి అన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. కులగణన సర్వేలో సర్వే అధికారులు కుటుంబాల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించాలని కోరారు.

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలని కొత్తగూడెం డీఎల్పీఓ రమణ అన్నారు. గురువారం ఆయన జూలూరుపాడు, జడలచింత, కొత్తూరు, రాజారావుపేట, భోజ్యాతండా గ్రామాల్లో పర్యటించి, సర్వే ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కరుణాకర్ రెడ్డి, ఎన్యుమరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్వేలో ఉపాధ్యాయులనే కొనసాగించాలి...

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఎన్యూమరేటర్లగా తమనే కొనసాగించాలని ఉపాధ్యాయులు కోరారు. కొందరు ఉద్యోగులను తొలగించడంతో గురువారం వారు తహసీల్దార్ కె.స్వాతిబిందుతో మాట్లాడారు. ఇప్పటికే స్టిక్కర్లు అంటించాక తొలగించి అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులను తీసుకోవడం సరికాదన్నారు. దీంతో స్పందించిన తహసీల్దార్ ఎన్యూమరేటర్లుగా ఉపాధ్యాయులనే కొనసాగించనున్నట్లు చెప్పడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.


జూలూరుపాడులో సర్వేను పరిశీలిస్తున్న డీఎల్పీఓ రమణ

ఇల్లెందురూరల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియ ఇల్లెందు మండల, పట్టణ పరిధిలో వేగవంతంగా సాగుతోందని తహసీల్దార్ కోట రవికుమార్ తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. సర్వే ప్రారంభమైన తొలి మూడు రోజులు కుటుంబాల గుర్తింపు ప్రక్రియను చేపడుతున్నామని తెలిపారు. మండలం, మున్సిపాలిటీ పరిధిలో 29 వేల కుటుంబాలు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించుకోగా, గురువారం వరకు రెండు రోజులు చేసిన సర్వేలో 22వేల కుటుంబాలు నమోదైనట్లు చెప్పారు. శనివారం నుంచి వివరాల సేకరణ ప్రారంభమవుతుందన్నారు.

సుజాతనగర్: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని కొత్తగూడెం డీఎల్‌పీఓ రమణ అన్నారు. సమగ్ర సర్వేలో భాగంగా ఇళ్లను గుర్తించే ప్రక్రియను వేపలగడ్డ గ్రామంలో గురువారం ఆయన పరిశీలించారు. ఇళ్ల వివరాలను ఎన్యూమరేటర్లు సేకరిస్తున్న తీరును పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ నెల 9 నుంచి ఇంటింటి సర్వే ఉంటుందని, ఇంటి వద్ద ఒకరు ఉండి వివరాలు వెల్లడించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవులు, సిబ్బంది లక్ష్మణ్ పాల్గొన్నారు.

రైతులను దగా చేయొద్దు..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి: తేమ, తరుగు పేరుతో రైతులను దగా చేయొద్దని, కేంద్రంపై అధికారులు, సొసైటీ బాధ్యులు నిత్యం పర్యవేక్షించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. మండలంలోని పెనగడప గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ... నియోజకవర్గ వ్యాప్తంగా సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం జరుతోందని, తక్షణమే ప్రతిపాదిత గ్రామాల్లో కేంద్రాలను సత్వరమే ఏర్పాటు చేయాలని, కేంద్రాల సంఖ్యను పెంచడం ద్వారా రైతులకు రవాణా ఖర్చులు ఆదా అవుతాయన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, కొనుగోలు కేంద్రాలను వినియోగించుకుని ప్రభుత్వ మద్దతు ధరతోపాటు బోనస్‌ను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, డీఏంఓ త్రినాథ్‌బాబు, ఏడీఏ నర్సింహారావు, తహసీల్దార్ పి.కృష్ణ, డీటీ ఉమా మహేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములు, ఏఓ రాజేశ్వరి, డీసీసీబీ మేనేజర్ శాంతి రాఘమయి, ఉపాధ్యక్షుడు కూచిపూడి జగన్నాథరావు, డైరెక్టర్ చంద్రగిరి శ్రీనివాస్‌రావు, ఏఈఓ మమత, తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల ప్రారంభం..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో శ్రీ సిద్దార్థ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలను గురువారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. మాట్లాడుతూ.. కొత్తగూడెం పట్టణంలో నర్సింగ్ కాలేజీ రావడం సంతోషకరమన్నారు. జిల్లా పరిసర ప్రాంతాలు విద్యార్థులు ఈ కోర్సులో చేరే అవకాశాన్ని ఉపయోగించుకొని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

జిల్లాను క్రీడా హబ్‌గా చేస్తా..

పాల్వంచ: చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, జిల్లాను క్రీడా హబ్‌గా చేస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం స్థానిక శ్రీనివాస కాలనీ మినీ స్టేడియంలో రూ.లక్ష నిధులతో రెండు టేబుల్ టెన్నిస్ బోర్డ్స్‌ని కూనంనేని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతీరోజు కనీసం అరగంట ఏదో ఒక క్రీడను ఎంచుకుని ఆడటం వల్ల శారీరక, మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి ఎం.పరంధామరెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ వాసిరెడ్డి నరేష్, అథ్లెటిక్ సెక్రటరీ మహీధర్, టెన్నిస్ జిల్లా ప్రెసిడెంట్ యుగంధర్, బాక్సింగ్ జిల్లా సెక్రటరీ రమేష్, ఆర్చరీ కోచ్ కల్యాణ్, కోచ్‌లు నాగేందర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి


మత్స్యకారులకు చేప పిల్లలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్

జూలూరుపాడు: మత్స్యకారులకు వంద శాతం సబ్సిడీతో చేపపిల్లలు సరఫరా చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆయన మండలంలోని ఏడు చెరువుల మత్స్య సహకార సంఘాలకు 48,750 చేపపిల్లలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన చేప పిల్లలను అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా, ఇక్కడ ఇస్తున్న పిల్లలు పెరగడానికి ఏడాదిన్నర సమయం పడుతుండగా, ఏపీలోని కైకలూరులో తీసుకొచ్చే పిల్లలు ఆరు నెలల్లో పెరుగుతున్నాయని మత్స్యకారులు చెప్పడంతో ఆయన పైవిధంగా స్పందించారు. కాగా, ప్రజలంతా కులగణన సర్వేకు సహకరించాలని కోరారు. అనంతరం తహసీల్‌లో పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, వివిధ శాఖల అధికారులతో సమావేశమై సీతారామ కెనాల్ నిర్మాణంతో 56భూమి కోల్పోతున్న 13 మంది రైతుల పరిహారంపై సూచనలు చేశారు. జిల్లా మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ అహ్మద్‌ఖాన్, తహసీల్దార్ కె.స్వాతి.బిందు, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ అర్జున్, డీఈ చంద్రశేఖర్, ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాద్‌రావు, సూపరింటెండెంట్ తాళ్లూరి రవి, నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, కొలిపాక వెంకటేశ్వర్లు, ధరావత్ రాంబాబు, నున్నా కృష్ణయ్య, వేల్పుల నర్సింరావు పాల్గొన్నారు.

పాల్వంచలో...

పాల్వంచరూరల్: మండలంలోని మత్స్యసహకార సొసైటీ సభ్యులకు 18 చెరువుల్లో విడుదల చేసేందుకు చేపపిల్లలను పంపిణీ చేశారు. పాత ఆర్డీఓ కార్యాలయంలో 1.35లక్షల చేపపిల్లలను ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి అందజేశారు. మత్స్య శాఖ కార్యాలయ ఉద్యోగులు నూరుద్దీన్, సూర్యప్రకాశ్, కృష్ణ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు చెల్లించండి..

ఇల్లెందు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రెండ్లీ ప్రభుత్వం అంటున్నప్పటికీ పెండింగ్ డీఏలకు మోక్షం లభించటం లేదని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.రాజు, పత్రికా సంపాదకులు రామాచారీ, రాష్ట్ర నాయకులు ఎస్.పూర్ణచందర్‌రావు, పి.శ్రీనివాసరావు, గుమ్మడి సమ్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఇల్లెందులో జరిగిన టీపీటీఎఫ్ మండల సమావేశంలో వారు మాట్లాడారు. పీఆర్సీ నివేదిక తెప్పించుకున్న ప్రభుత్వం ఉద్యోగుల ఫిట్‌మెంట్ ఇవ్వకుండా జాప్యం చేస్తోందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు.

అనంతరం టీపీటీఎఫ్ మండల నూతన అధ్యక్షుడిగా బి.వెంకట్రాం, కార్యదర్శిగా సర్వేశ్వరరావులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో భాగ్యారావు, బి.బాలు, ఉమాదేవి, సమ్మయ్య, ఈశ్వర్, రమేష్, లాలు, రాజారత్నం, పూర్ణిమ, సరోజిని, వినోద, రాధా, కమల పాల్గొన్నారు.

యాష్ తరలింపునకు అనుమతి ఇవ్వాలి

పాల్వంచ: కేటీపీఎస్ కాలుష్య ప్రాంతాలకు చెందిన గిరిజనులను యాష్ తరలింపునకు ఐటీడీఏ అధికారులు ఎంపిక చేశారని, వారికి తక్షణం అనుమతులు ఇవ్వాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు.

స్థానిక కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో గిరిజన కాంట్రాక్టర్ల నిరసన దీక్షకు గురువారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పానిశెట్టి మాట్లాడుతూ... కరకవాగు, సురారం, పుల్లాయిగూడెం గ్రామాలకు చెందిన గిరిజనులు 39 మందిని అధికారులు ఎంపిక చేసి జాబితాను జెన్‌కో అధికారులకు పంపించి నెల రోజులు దాటుతున్నా కనీసం పట్టించుకోక పోవడంతో బూడిద నిల్వలు పేరుకు పోయి కాలుష్యం పెరుగుతోందన్నారు. వారి సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో భట్టు కృష్ణ, గాంధీ, జవహర్ లాల్, శ్రీకాంత్, చందర్, వీరు, హరీష్ పాల్గొన్నారు.


దీక్షకు మద్దతు తెలుపుతున్న బీజేపీ నాయకులు

'ఉపాధి' యూనిట్లను వినియోగించుకోండి..


కోడిపిల్లలను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: పొదుపు సంఘాల మహిళలు స్వయం ఉపాధి యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 30 మంది పొదుపు సంఘాల మహిళలకు మహిళా శక్తి పథకంలో భాగంగా 1,400 కోడి పిల్లలు, పోషణ సామగ్రిని ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళా శక్తి పథకంలో భాగంగా స్వయం ఉపాధి లక్ష్యంగా ప్రభుత్వం అనేక యూనిట్లను మంజూరు చేస్తోందన్నారు.

కార్యక్రమంలో సౌజన్య, సుభాష్, దుర్గారావు, ఖమ్మంపాటి నర్సింహారావు, రాంబాబు, సంపత్, భూలక్ష్మి, నాగేంద్ర, స్వర్ణలత, రామ్మూర్తి, కొమ్మాలు, లాలయ్య, నందకుమారి, ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

ఇల్లెందురూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి పొడుగు నర్సింహారావు అన్నారు. మండలంలోని పోలారం గ్రామంలో పులుసు వెంకన్న స్మారక స్తూపం వద్ద గురువారం అమరులకు నివాళులర్పించారు. మాట్లాడుతూ.. భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తి కోసం జరిగిన పోరాటంలో అనేక మంది విప్లవకారులు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు ఏజెన్సీలో సాగు చేసుకునేందుకు ప్రజలకు భూమి దక్కిందని, స్వేచ్ఛగా జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మోడెం వెంకన్న, ధరావత్ రవి, భాష్‌సింగ్, మంగ్యా, సీతారాములు, వీరన్న, హరోజ్యా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎన్డీ నాయకులు